

ప్రముఖ అణు శాస్త్రవేత్త డాక్టర్ రాజగోపాల చిదంబరం కన్నుమూత


4

# జర్నలిస్ట్ వార్త

TELTEL/2023/87607

తెలుగు దిన పత్రిక

అనుక్షణం ప్రజల పక్షం...



WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103



సంపుటి - 1 సంచిక - 330 ఆదివారం 5 జనవరి 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


## పోలవరం ప్రాజెక్ట్ ముంపుపై అధ్యయనం

- ఐఐటీ బృందంతో అధ్యయనానికి రేవంత్ రెడ్డి ఆదేశాలు
- నెల రోజుల్లో నివేదిక సిద్ధం చేయాలని ఆదేశం
- సమన్వయం కోసం ప్రత్యేక అధికారిని నియమించాలన్న రేవంత్ రెడ్డి
- భద్రాచలం ఆలయానికి ముప్పు ఏర్పడే అవకాశాలపై అధ్యయనం



2లో

## రైతు భరోసా ఎకరానికి

# ఏడాదికి రూ.12వేలు

### కేబినెట్ నిర్ణయాలను వెల్లడించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

### జనవరి 26 నుంచి మూడు పథకాల అమలు

- రైతు భరోసానుఎకరానికి ఏడాదికి రూ.12వేలు
- సాగులో లేని భూములకు భరోసాఇవ్వం
- రెవెన్యూ అధికారుల సర్వేలోసాగు భూముల నిర్ధారణ
- గ్రామసభల్లో ఆమోదం పొందినభూములకే భరోసా
- 26 నుంచి కొత్త రేషన్‌కార్డులు
- ప్రభుత్వ ఆదాయం పేదలకు పంచడం మావిధానం
- వ్యవసాయాన్ని పండుగ చేయాలనే లక్షంతోనే
- రైతు భరోసాను రూ.12వేలకు పెంచాం



హైదరాబాద్‌జనవరి04(జర్నలిస్ట్ వార్త): : వ్యవసాయ యోగ్యమైన భూములకు రైతు భ రోసా ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించిందని అలాగే భూమిలేని వ్యవసాయ కుటుంబాలకు 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథ కం' కింద ఏటా రూ.12 వేలు సాయం అందించాలని మంత్రి మండలి నిర్ణయించిందని సిఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. వీ టితో పాటు పేదలకు కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని సి ఎం తెలిపారు. ఈ నెల 26 నుంచి రైతుభరోసా, ఇందిరమ్మ ఆ త్మీయ భరోసా, రేషన్ కార్డుల పంపిణీ జరుగనుందని ఆయన తెలిపారు.

## ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను పట్టించుకోని కాంగ్రెస్

- గ్రామాల నుంచి పట్టణాలకు
- పెరిగిన వలసలు
- గ్రామాలకు, పట్టణాలకు మధ్య
- గ్యాప్ పెరుగుతూనే ఉంది
- గ్రామీణ భారత మహోత్సవం 2025 కార్యక్రమంలో ప్రధాని మోడీ



న్యూఢిల్లీ,జనవరి04(జర్నలిస్ట్ వార్త): వెనకబడిన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను గత ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోలేదని ప్రధాని మోడీ విమర్శించారు. దాంతో గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు పెరిగాయన్నారు. ఫలితంగా పట్టణాల్లోనూ పేదరికం పెరిగిపోయిందన్నారు. సమాజంలో ఎన్నో మార్పులు వస్తున్నా గ్రామాలకు, పట్టణాలకు మధ్య గ్యాప్ పెరుగుతూనే ఉందని ప్రధాని నరేంద్ర మోడీ ఆవేదన వ్యక్తం చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన గ్రామీణ భారత మహోత్సవం 2025 కార్యక్రమంలో ప్రధాని మోడీ పాల్గొన్నారు. మిగతాది 2లో...

## తెలియకుండానే తెలుగు అంతరించే ప్రమాదం

- ప్రాథమిక స్థాయి వరకు తెలుగులోనే బోధన
- తెలుగులో కోర్టుల్లో వాదనలు, ప్రతివాదనలు
- సినిమా పేర్లు తెలుగులో ఉండాల్సిందే
- తెలుగు సమాఖ్య మహాసభల్లో కిషన్ రెడ్డి

హైదరాబాద్,జనవరి04(జర్నలిస్ట్ వార్త): మనకు తెలియకుండానే తెలుగు భాష కనుమరుగయ్యే పరిస్థితి నెలకొందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాథమిక స్థాయి వరకు మాతృభాషలోనే విద్య ఉండాలని సూచించారు.



2లో.

## నాంపల్లి కోర్టుకు హాజరైన అల్లు అర్జున్

### ష్యూరిటీలపై సంతకం చేసిన బన్నీ



2లో.

## రేవంత్.. కటింగ్ మాస్టర్

- రైతుభరోసాపై ఆంక్షలు..లబ్ధిదారుల సంఖ్య కుదింపునకుయత్నాలు
- రూ.2లక్షల రుణమాఫీ పూర్తిగా ఎక్కడా జరగలేదు
- ఏ గ్రామానికి వెళ్లినా..ఈ వాస్తవం బయటపడుతుంది
- ఆరుగ్యారంటీల్లో అరగ్యారంటీయే అమలు
- సిరిసిల్ల కార్యకర్తలసమావేశంలో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

2లో.



## చెరిపితే చెరిగేది కాదు చరిత్ర: కెసిఆర్



హైదరాబాద్(జనవరి04(జర్నలిస్ట్ వార్త): తెలంగాణ అస్తిత్వ ప్రతీకగా ప్రజల హృదయాలలో స్వచ్ఛందంగా ప్రతిష్ఠించుకున్న తెలంగాణ తల్లి రూపాన్ని ఎవ్వరూ చెరిపేయలేరని తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు అన్నారు. తెలంగాణ తల్లి రూపాన్ని స్వరాష్ట్ర ఉద్యమంలోనే రూపొందించబడిందని ఆయన చెప్పారు. ఎర్రవల్లి లోని కేసీఆర్ నివాసంలో శనివారం సాయంత్రం తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ సంపాదకత్వంలో వెలువరించిన 'అందరికీ అమ్మ' అన్న పుస్తకాన్ని కేసీఆర్ ఆవిష్కరించారు. తెలంగాణ తల్లి రూపాన్ని గుండెల్లో దాచుకుని స్వరాష్ట్ర ఉద్యమం మహొూగ్రంగా సాగిందన్నారు. తెలంగాణ తల్లి రూపం రాష్ట్ర సాధన ఉద్యమ ప్రతి అడుగులో, ప్రతి మలుపులో దారిచూపిన తల్లి రూపంగా నిలిచిందన్నారు.స్వరాష్ట్రంలో కూడా సాంస్కృతిక ఉద్యమం నిరంతరంగా కొనసాగుతుందని తెలిపారు. తెలంగాణ తల్లులు ఎత్తిన బోనాలలో, బతుకమ్మలలో కోట్లాది మంది తల్లులు పాల్గొన్న వంటావార్పుల్లో సబ్బండ వర్ణాలు చేసిన ఉద్యమాల్లో గడప గడపకు తెలంగాణ తల్లి భావోద్వేగ రూపం ప్రతిష్ఠించబడిందని కేసీఆర్ చెప్పారు. చరిత్రను ఎవ్వరు చెరిపేయలేరని, చరిత్ర చెరిపితే చెరిగేది కాదని, చరిత్రే పాఠం చెబుతుందన్నారు. ఈ పుస్తకావిష్కరణలో తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్, మాజీ మంత్రులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భూపాల్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, సునీత, శాసనమండలి సభ్యులు తాతామధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ పరిశ్రమలో పేలుడు

ఒకరి మృతి..మరొకరి పరిస్థితి విషమం


మృతుడు బచ్చన్నపేటకు చెందిన కనకయ్యగా గుర్తింపు

ఘటనాస్థలిని సందర్శించిన ఏసీ బీర్ల అయిలయ్య



2లో.

## ఫ్లూ లక్షణాలు ఉంటే మాస్క్ ధరించాల్సిందే




2లో.

# పోలవరం ప్రాజెక్ట్ ముంపుపై అధ్యయనం

**● ఐఐటీ బృందంతో అధ్యయనానికి రేవంత్ రెడ్డి ఆదేశాలు**

విజయవాడజనవరి04(జర్నలిస్ట్ వార్త):
ఆంధ్రప్రదేశ్‌లో నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు కారణంగా తెలంగాణ మీద పడే ప్రభావాన్ని అధ్యయనం చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఐఐటీ హైదరాబాద్ బృందంతో అధ్యయనం చేయించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.నెల రోజుల్లో దీనికి సంబంధించి సమగ్ర నివేదిక సిద్ధం చేయాలన్నారు. ఐఐటీ హైదరాబాద్ బృందంతో సమన్వయం చేసుకోవడానికి ప్రత్యేక అధికారిని నియమించాలని సీఎం ఆదేశించారు.పోలవరం ప్రాజెక్టు వల్ల భద్రాచలం ఆలయానికి ముప్పు ఏర్పడే అవకాశాలపై ఐఐటీ హైదరాబాద్ బృందం అధ్యయనం చేయనుంది. 2022లో 27 లక్షల క్యూసెక్కుల వరద వచ్చిన సమయంలో భద్రాచలం వద్ద ముంపునకు గురైనట్లు అధికారులు... ముఖ్యమంత్రికి వివరించారు. అలాగే ఏపీ ప్రభుత్వం చేపట్టిన గోదావరి–బనకచర్ల మెగా ప్రాజెక్టు అంశాన్ని కూడా అధికారులు... సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. వరద జలాల ఆధారంగా నిర్మించనున్న ఈ ప్రాజెక్టుకు ఇంకా ఎలాంటి అనుమతులు లేవన్నారు. తెలంగాణ అభ్యంతరాలను ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి చెప్పాలని సీఎం సూచించారు.

## ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను పట్టించుకోని కాంగ్రెస్

(మొదటి పేజి తరువాయి)

ఇక, మారుమూల గ్రామాల ప్రజలను దేశ అభివృద్ధిలో భాగం చేయడమే లక్ష్యంగా తమ సర్కార్ కృషి చేస్తోందని చెప్పుకొచ్చారు. గ్రామీణ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేసేందుకు సమ్మిళిత ఆర్థిక విధానాలు అవసరం. ఇక, కరోనా సమయంలో భారత్‌లోని మారుమూల గ్రామల ప్రజలకు సైతం మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకున్నామని ప్రధాని మోడీ పేర్కొన్నారు. ఇక, డిజిటల్ టెక్నాలజీ సహాయంతో దేశంలోని అత్యుత్తమ వైద్యులు, ఆసుపత్రులను మారుమూల గ్రామాలకు అనుసంధానం చేశామని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. గ్రామాలలోని ప్రజలు ప్రస్తుతం టెలీమెడిసిన్ సౌకర్యాలను పొందుతున్నారని చెప్పుకొచ్చారు. అలాగే, పల్లెల్లోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన త్రాగు నీరు, మౌలిక వసతులు అందిస్తున్నాం.. పీఎం–కిసాన్ పథకం ద్వారా, రైతులకు కేంద్ర ప్రభుత్వం రూ.3 లక్షల కోట్ల ఆర్థిక సహాయం అందిస్తుంది.. అలాగే, తమ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పథకాల వల్ల గ్రామీణ భారతంలో పేదరికం దాదాపు 26 శాతం నుంచి 5 శాతానికి తగ్గిపోయిందని నరేంద్ర మోడీ వెల్లడించారు. సమాజంలో ఎన్ని మార్పులు వస్తున్నా గ్రామాలకు, పట్టణాలకు మధ్య అంతరం పెరుగుతూనే ఉందని ప్రధాని ఆవేదన వ్యక్తంచేశారు. దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని ప్రాంతాలు ప్రస్తుతం తమ పాలనలో సమాన హక్కులు పొందుతున్నాయని ప్రధాని పేర్కొన్నారు. సమాజ సాధికారతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, పాటిస్తున్న విధానాలు గ్రామీణ భారతంలో కొత్త శక్తిని నింపుతున్నాయన్నారు. మారుమూల గ్రామాల ప్రజలను దేశ అభివృద్ధిలో భాగం చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గ్రామీణ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేయడానికి సమ్మిళిత ఆర్థిక విధానాలు అవసరమని పేర్కొన్నారు. కొవిడ్ సమయంలో భారత్‌లోని మారుమూల ప్రాంతాల ప్రజలు ఆ మహమ్మారిని ఎలా ఎదుర్కొంటారని ప్రపంచ దేశాలు అనుమానం వ్యక్తంచేసినట్లు మోదీ పేర్కొన్నారు. కానీ తమ ప్రభుత్వం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటూ మారుమూల ప్రాంతాల ప్రజలకు సైతం మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుందన్నారు. డిజిటల్ టెక్నాలజీ సహాయంతో దేశంలోని అత్యుత్తమ వైద్యులు, ఆసుపత్రులను గ్రామాలకు అనుసంధానించామని వెల్లడించారు. గ్రామాలలోని ప్రజలు ప్రస్తుతం టెలీమెడిసిన్ సౌకర్యాలను సైతం పొందుతున్నారన్నారు. పల్లెల్లోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నీరు, మౌలిక వసతులు అందిస్తున్నామని మోదీ పేర్కొన్నారు. తమ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పథకాల మూలంగా గ్రామీణ భారతంలో పేదరికం దాదాపు 26 శాతం నుంచి 5 శాతానికి తగ్గిందని వెల్లడించారు.

## తెలియకుండానే తెలుగు అంతరించే ప్రమాదం

హైదరాబాద్‌లో రెండో రోజు ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడారు. కేంద్ర తెచ్చిన కొత్త విద్యా విధానాన్ని రాష్ట్రాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కోర్టుల్లో వాదనలు, ప్రతివాదనలు తెలుగులో జరగాలని డిమాండ్ చేశారు. సినిమాల పేర్లు కూడా తెలుగులోనే ఉండాలని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. తెలుగు సమాఖ్య మహాసభలకు హాజరైన కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని నిర్వాహకులు సన్మానించారు. మాట్లాడటం, రాయడం ద్వారానే భాషను పరిరక్షించగలమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఈ సందర్భంగా అన్నారు. పిల్లలతో రోజూ బాల సాహిత్యం చదివించాల్సిన అవసరం ఉందని చెప్పారు. డిజిటల్ విభాగంలో తెలుగు భాష క్రోడీకరించి భావితరాలకు అందించాలన్నారు. డిజిటల్ రంగంలో మాతృ భాష అభివృద్ధి, సంరక్షణకు దోహదం చేయాలని పేర్కొన్నారు. 'వికీపీడియాలో తెలుగు వ్యాసాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కథలు, వ్యాసాలు ఆడియో రూపంలో అందుబాటులో ఉన్నాయి. తెలుగు కనుమరుగు కాకముందే పరిరక్షించు కోవాలన్నారు. బోధనా భాషగా ప్రాచుర్యంలోకి తేవాలి. పాలన, అధికార వ్యవహారాలు తెలుగులో జరగాలి. కొత్త సాంకేతికత, కార్యక్రమాలను మాతృభాషలోనే చేపట్టాలి. వాడుక భాషలో 30 శాతమే తెలుగు ఉంది. 70 శాతం ఆంగ్ల పదాలే ఉన్నాయి. మనకు తెలియకుండానే తెలుగు భాష కనుమరుగయ్యే పరిస్థితి కనినిస్తోందని అన్నారు. ప్రాథమిక స్థాయి వరకు మాతృభాషలో విద్య ఉండాలి. కేంద్రం తెచ్చిన కొత్త విధానాన్ని అమలు చేయాలి. ప్రాంతీయ భాష పరిరక్షణకు పెద్దల సహకారం కావాలి. కోర్టుల్లో వాదనలు, ప్రతివాదనలు తెలుగులో ఉండాలి. కోర్టు తీర్పులు, సినిమాల పేర్లు తెలుగులో ఉండాలని కిషన్ రెడ్డి అన్నారు.

# ప్రీమియర్ ఎక్స్‌క్లూజివ్ పరిశ్రమలో పేలుడు

**ఒకరి మృతి..మరొకరి పరిస్థితి విషమం**

యాదగిరిగుట్ట,జనవరి04(జర్నలిస్ట్ వార్త): యాదగిరిగుట్ట మండలంలోని ఓ పరిశ్రమలో పేలుడు సంభవించి ఒకరు మృతి చెందారు. పెద్దకందుకూరులోని ప్రీమియర్ ఎక్స్‌క్లూజివ్ పరిశ్రమలో ఈ పేలుడు చోటుచేసుకుంది. ఈ ఘటనలో జనగామ జిల్లా బచ్చన్నపేటకు చెందిన కనకయ్య అనే కార్మికుడు మృతి చెందాడు. మరో ఏడుగురు కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో యాదగిరిగుట్ట మండలం రామాజీపేట గ్రామానికి చెందిన మొగిలిపాక ప్రకాష్ పరిస్థితి విషమంగా ఉంది. దీంతో ఆయన్ను భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో కార్మికులు బయటకు పరుగులు పెట్టారు. యాజమాన్యం ఎమర్జెన్సీ సైరన్‌తో కార్మికులను అప్రమత్తం చేసింది. పలువురు క్షతగాత్రులను హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుప్రతులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనాస్థలాన్ని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పరిశీలించారు. ప్రమాదం గురించి పోలీసులను అడిగి తెలుసుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ ప్రమాదాలు జరుగుతున్నా యాజమాన్యం చర్యలు చేపట్టడం లేదని మండిపడ్డారు. గత మూడేళ్ల వ్యవధిలో ఐదుగురు కార్మికులు చనిపోయారని.. కార్మికుల ప్రాణాలు పణంగా పెట్టి కంపెనీలు ధనార్జన చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెయ్యి మంది ఉద్యోగులు ఉన్న కంపెనీలో అంబులెన్స్ కూడా లేదన్నారు. ప్రమాదాల నివారణపై యాజమాన్యంతో చర్చిస్తామని చెప్పారు. ఘటనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

# రైతు భరోసా ఎకరానికి ఏడాదికి రూ.12వేలు

కేబినెట్ తీసుకున్న ముఖ్యమైన నిర్ణయాలకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడు తూ రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కా ర్డులకు సంబంధించి కేబినెట్ భేటీలో చర్చించామన్నారు. వ్య వసాయ యోగ్యమైన భూమికి గత ప్రభుత్వం ఎకరాకు రూ. 10వేలు ఇస్తే ప్రస్తుతం రైతులందరికి ఎకరానికి రూ.12వేలు ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. దీంతోపాటు 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' కింద భూమిలేని వ్యవసాయ కుటుంబాలకు రూ.12వేలు, రేషన్ కార్డులు లేని అర్హులందరికీ కార్డులు అం దించాలని నిర్ణయించామని ఈ మూడు అంశాలు జనవరి 26 వ తేదీ నుంచి అమలవుతాయని సిఎం తెలిపారు.
డా.బిఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని 26వ తేదీనే అమలు చేశారని అందులో భాగంగానే తాము ఈ మూడింటిని అమల్లోకి తీసుకురావాలని నిర్ణయించామని ఆయన పేర్కొన్నారు. రైతులకు మేలు చేయాలన్న అందించాలన్న ఉద్ధేశ్యంతో ఈ అంశాలను అమలు చేయనున్నట్టు ఆయన తెలిపారు. వ్యవసాయా న్ని పండుగ చేయాలన్న ఉద్ధేశ్యంతో తాము ఈ నిర్ణయాన్ని అ మలు చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. రైతులు గందరగోళపడకుండా ప్రభుత్వం నిర్ణయాలు తాను వెల్లడిస్తున్నానని ఆయ న తెలిపారు. వ్యవసాయానికి అనుకూలమైన భూములకే రైతుభరోసా పథకాన్ని వర్తింప చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపా రు. రాళ్లు, రప్పలు, రియల్ వెంచర్‌లుగా మారిన భూముల కు, నాలా కన్వర్షన్ అయిన వాటికి, సాగుకు అనుకూలంగా లేని భూములకు ఈ పథకం వర్తించదని ఆయన పేర్కొన్నారు. దీనికి సంబంధించి రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి వాటిని గ్రామసభల్లో పెడతారని ఆయా భూములకు గ్రామసభలు ఆమోదింప చేసుకున్న తరువాత వాటికి రైతుభరోసా ప థకాన్ని అమలు చేస్తామని సిఎం తెలిపారు.
ఆదాయాన్ని పెం చాలి, పేదలకు పంచాలన్నదే తమ ఉద్ధేశ్యమని సిఎం పేర్కొన్నారు. సిఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో కేబినె ట్ సమావేశం మూడుగంటల పాటు కొనసాగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. అందులో భాగం గా కేబినెట్ పలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నట్టుగా తెలిసింది. ఈ అజెండాలో 22 అంశాలు ఉండగా అందులో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలకు ఆమోదముద్ర వే యగా, రేషన్ కార్డుల జారీని ఈనెల 26వ తేదీ నుంచి అమల్లోకి తీసుకురావాలని కేబినెట్ నిర్ణయించింది. వీటితో పాటు ఇందిరమ్మ ఇళ్లు, బిసి రిజర్వేషన్లు, నూతన మండలాల ఏర్పాటు, సన్న బియ్యం %–% ఎప్పటి నుంచి ఇవ్వాలన్న అంశాలపై కూడా కేబినెట్ చర్చించినట్టుగా సమాచారం. అంతేకాకుండా పాలమూరు –రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి మాజీ కేంద్రమంత్రి సూదిని జైపాల్ రెడ్డి పేరు పెట్టాలని, సింగూరు ప్రాజెక్టుకు మంత్రి దామోదర రాజనర్సింహ తండ్రి, దివంగత మంత్రి రాజనర్సింహ పేరు పెట్టాలని నిర్ణయం తీసుకున్నట్టుగా తెలిసింది. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ప్యాకేజీ 2 వ్యయం రూ.1,784 కోట్లకు పెంచుతూ కేబినెట్ నిర్ణయం తీసుకున్నట్టుగా సమాచారం. ఇక, పాలమూరు –రంగారెడ్డిలో భాగంగా ఎదుల–డిండికి రూ.1800 కోట్ల అంచనా వ్యయానికి, మరోవైపు పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌లో 588 కారుణ్య నియామకాలకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టుగా తెలిసింది.రాష్ట్ర వ్యాప్తంగా 56 గ్రామాలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేయాలని, తెలంగాణ టూరిజం పాలసీకి కేబినెట్ ఆమోదం తెలిపినట్టుగా సమాచారం. ఫిబ్రవరి నుంచి సన్నబియ్యాన్ని కూడా పంపిణీ చేయాలని కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టుగా తెలిసింది. జూరాల జలాలతో మహబూబ్ నగర్ జిల్లాలో కొత్తగా మరింత ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ఉన్న మార్గాలు, ప్రత్యేమ్నాయాలను పరిశీలించేందుకు టెక్నీకల్ ఎక్స్పర్ట్ కమిటీని నియమించాలని కేబినెట్ నిర్ణయించింది. ఎక్కడ నీటి లభ్యత ఉంది..? ఎక్కడ నుంచి ఎంత నీటిని తీసుకునే వీలుంది..? ఎక్కడెక్కడ రిజర్వాయర్లు నిర్మించాలి..? ఇప్పుడున్న ప్రాజెక్టులకు మరింత నీటిని తీసుకునే సాధ్యాసాధ్యాలపై కమిటీ అధ్యయనం చేస్తుంది. మల్లన్న సాగర్ నుంచి గోదావరి జలాలను హైదరాబాద్ తాగునీటికి తరలించే గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై స్కీమ్ ఫేజ్–2, ఫేజ్–3 కి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గతంలో 15టీఎంసీలకు ప్రతిపాదించిన ఈ పథకాన్ని భవిష్యత్ అవసరాల దృష్ట్యా 20 టీఎంసీలకు పెంచేందుకు ఆమోదం తెలిపింది.కొత్తగూడెంను మున్సిపల్ కార్పొరేషన్‌గా, ములుగు గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా అప్ గ్రేడ్ చేసేందుకు కేబినేట్ ఆమోద ముద్ర వేసింది.

# రేవంత్.. కటింగ్ మాస్టర్

**రైతుభరోసాపై ఆంక్షలు..లబ్ధిదారుల సంఖ్య కుదింపునకుయత్నాలు**

**రూ.2లక్షల రుణమాఫీ పూర్తిగా ఎక్కడా జరగలేదు**

**ఏ గ్రామానికి వెళ్లినా..ఈ వాస్తవం బయటపడుతుంది**

**ఆరుగ్యారంటీల్లో అరగ్యారంటీయే అమలు**

**సిరిసిల్ల కార్యకర్తలసమావేశంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్**



సిరిసిల్ల:జనవరి04(జర్నలిస్ట్ వార్త):
సిఎం రేవంత్‌రెడ్డి ఆయా పథకాల లబ్ధిదారుల సంఖ్యపై కోతలు పెడు తూ కటింగ్ మాస్టర్‌లా మారారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శించారు. అన్నదాత ప్రమా ణ పత్రం ఇస్తేనే రైతుబంధు నిధులు వేస్తానని రేవంత్‌రెడ్డి అంటున్నారని, ఇంతకన్నా దారుణం ఏముందని ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగులకు రైతుబంధు లేదని కోతలు పెడుతున్నారని విమర్శించారు.
కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల్లో ఆరు గ్యారంటీల అమలు అని చెప్పి, 400 రో జులైనా అర గ్యారంటీ.. అదీ ఫ్రీ బస్ తప్ప మరేమీ అమలు కాలేదని బిఆర్ఎస్ వర్కిం గ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎంఎల్ఏ కెటిఆర్ ఎద్దేవా చేశారు. సిరిసిల్లలో శనివారం పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తే తనపై ఆరు కేసులు పెట్టాలని కాంగ్రెస్ చూస్తోందని ఆరోపించారు. గడిచిన 13 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని అన్నారు. రెండు లక్షల రూపాయల రుణమాఫీ అమలు కాలేదన్నారు. కాంగ్రెస్ నేతలకు పరిపాలన చేతకావడం లేదన్నారు. వరంగల్‌లో రైతు డిక్లరేషన్ ప్రకటించిన కాంగ్రెస్ ఇప్పుడు రైతులనే పంటలు పండించినట్లు డిక్లరేషన్ అడుగుతున్నారని మండిపడ్డారు. అసెంబ్లీలో రైతుబంధులో రూ.22 వేల కోట్లు దారిమళ్లాయని తప్పుడు ప్రకటన చేశారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై బద్‌నామ్ చేశారని, 3 నెలల్లో మేడిగడ్డను రిపేర్ చేసే అవకాశాలున్నా చేయలేదన్నారు. భూకంపం వచ్చినా వరదలు వచ్చినా కాళేశ్వరం తట్టుకుందన్నారు. ఢిల్లీ కాంగ్రెస్‌కు తెలంగాణ కాంగ్రెస్ ఏటిఎంగా మారిందన్నారు. వేల కోట్లు ఢిల్లీకి పంపారన్నారు.
కొత్త సంవత్సరంలో పార్టీ బలోపేతానికి పార్టీ సంస్థాగత ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకునేవారు ప్రజల పక్షాన నిలబడి పనులు చేయాలని, కేసులకు భయపడవద్దని అన్నారు. రైతుల పక్షాన గులాబీ దండు నిలబడాలన్నారు. కెసిఆర్ హయాంలో రైతుబంధును 12 దఫాలుగా రూ.80 వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేశారన్నారు. రుణమాఫీ కింద రూ.47 వేల కోట్లు 70 లక్షల మంది రైతులకు ఇచ్చారన్నారు. మరోసారి సిఎంగా కెసిఆర్‌ను చూడాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. త్వరలోనే బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు తథ్యమన్నారు. సిరిసిల్లలో లీగల్ సెల్ ఏర్పాటుకు కృషి జరుగుతోందని అన్నారు. తమ పార్టీ కార్యకర్తలను వేధించినవారి వివరాలు తమ దగ్గర ఉన్నాయని, తాము అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతీకారం తప్పక తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి బోయినిపల్లి వినోద్‌కుమార్, పార్టీ నాయకులు కొండూరి రవీందర్ రావు, కొప్పుల ఈశ్వర్, తోట ఆగయ్య, జిందం కళచక్రపాణి, జిందం చక్రపాణి, దిడ్డి రాజు తదితరులు పాల్గొన్నారు.


## ఫ్లూ లక్షణాలు ఉంటే మాస్క్ ధరించాల్సిందే

హైదరాబాద్(జనవరి04(జర్నలిస్ట్ వార్త):
చైనాలో హెచ్ఎంపీవీ వైరస్ వ్యాప్తి నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఫ్లూ లక్షణాలు ఉన్నవారు మాస్క్ ధరించాలని వైద్యారోగ్య శాఖ సూచించింది. ఇప్పటివరకు రాష్ట్రంలో హెచ్ఎంపీవీ వైరస్ కేసులు నమోదు కాలేదని వైద్యారోగ్య శాఖ తెలిపింది. జలుబు, దగ్గు లక్షణాలు ఉన్నవారు సమూహాలకు దూరంగా ఉండాలని సూచించింది. హెచ్ఎంపీవీ వైరస్ లక్షణాలు కూడా ఫ్లూ, ఇతర శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల మాదిరిగానే ఉంటాయని వైద్య నిపుణులు వెల్లడించారు. దగ్గు, జ్వరం, ముక్కు దిబ్బడగా అనిపించడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటివి కనిపిస్తాయి. వైరస్ తీవ్రత ఎక్కువగా ఉన్నవారిలో బ్రాంకైటిస్, నిమోనియాకు దారితీయవచ్చు. వ్యాధి లక్షణాలు బయటకు కనిపించడానికి మూడు నుంచి ఆరు రోజులు పడుతుంది. అమెరికాకు చెందిన సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (అఆఅ) ప్రకారం.. చిన్నారులు, వృద్ధులు, బలహీనమైన రోగనిరోధక శక్తి కలిగిన వ్యక్తులు దీనిబారిన పడే అవకాశాలు ఎక్కువ.

## నాంపల్లి కోర్టుకు హాజరైన అల్లు అర్జున్

**ష్యూరిటీలపై సంతకం చేసిన బన్నీ**

హైదరాబాద్( జనవరి04(జర్నలిస్ట్ వార్త):



బెయిల్ మంజూరు కావడంతో హీరో అల్లు అర్జున్ నాంపల్లి కోర్టుకు హాజరయి పూచీకత్తు సమర్పించారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో ఏ11గా ఉన్న అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. దీంతో పూచీకత్తు సమర్పించేందుకు, మేజిస్ట్రేట్ ముందు కొన్ని పత్రాలపై సంతకాలు చేసేందుకు అల్లు అర్జున్ నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. రెండు షూరిటీలను, వ్యక్తిగతంగా బాండ్ ను బన్నీ సమర్పించారు. అల్లు అర్జున్ పర్సనల్ మేనేజర్ మరొక షూరిటీ ఇచ్చారు. అల్లు అర్జున్ వెంట ఆయన మావయ్య చంద్రశేఖర్ రెడ్డి, ఉన్నారు. ఇప్పటికే సంధ్య థియేటర్ ఘటనలో అల్లు అర్జున్‌ను పోలీసులు అరెస్ట్ చేయగా.. ఆయనకు తెలంగాణ హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఈలోపు రెగ్యులర్ బెయిల్ కోసం ట్రయల్ కోర్టును అల్లు అర్జున్ ఆశ్రయించారు. ఓవైపు పోలీసుల తరపు న్యాయవాదులు అల్లు అర్జున్‌కు బెయిల్ మంజూరు చేయవద్దని కోరారు. బన్ని తరపు న్యాయవాదులు మాత్రం బెయిల్ కోసం గట్టిగా వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం చివరకు అల్లు అర్జున్‌కు బెయిల్ మంజూరు చేసింది. దీంతో షూరిటీస్ సమర్పించేందుకు అల్లు అర్జున్ కోర్టుకు చేరుకున్నారు.ఇప్పటికే సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో అల్లు అర్జున్‌ను పోలీసులు అరెస్ట్ చేయగా.. ఆయనకు తెలంగాణ హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది.

జర్నలిస్ట్ వార్త
ఆదివారం 5 జనవరి 2025

# రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు

- రోడ్డు భద్రత ప్రమాణాలపై విస్తృత ప్రచారం కల్పించాలి
- జిల్లా హెడ్ క్వార్టర్లో పిల్లలచే రోడ్డు భద్రతా ప్రమాణాలపై భారీ ర్యాలీ
- గురుకులాలో పిల్లలకు అందించే ఆహార నాణ్యతపై తనిఖీలు నిర్వహించాలి
- రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్






హనుమకొండ జనవరి 4,(జర్నలిస్ట్ వార్త): రోడ్డు భద్రత ప్రమాణాల అవగాహనపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శనివారం రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షించారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరికి రోడ్డు భద్రత ప్రమాణాలపై అవగాహన కల్పించేలా రోడ్డు భద్రత వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని కోరారు. హైదరాబాద్ నుంచి రోడ్లు, భవనాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ తో కలిసి రోడ్డు భద్రత వారోత్సవాల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. గతంలో కేంద్ర ప్రభుత్వం రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించేదని, దీని ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని నేడు రొడ్డు భద్రతా మాసోత్సవం చేపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి శాఖను భాగస్వామ్యం చేస్తూ, వినూత్నంగా ప్రజలకు చేరేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. రోడ్డు భద్రత ప్రమాణాలపై వేడుకలు ప్రతి గ్రామంలో జరగాలని అన్నారు. పిల్లల్లో రొడ్డు భద్రతా ప్రమాణాలపై అవగాహన కల్పించేందుకు ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. సంక్రాంతి సెలవుల తర్వాత విద్యార్థులచే ప్రతి జిల్లా, మండల హెడ్ క్వార్టర్లో భారీ ర్యాలీ చేపట్టాలని అన్నారు. ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ శాఖలు తమ పరిధిలో రొడ్డు భద్రతా ప్రమాణాల కార్యక్రమాలు జరగాలని అన్నారు. రవాణా శాఖ, పోలీస్ శాఖ, విద్యాశాఖ, రొడ్డు భవనాలు, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, రోడ్డు భద్రత కార్యక్రమాలు విజయవంతం చేయాలని అన్నారు. భారీ తుఫాన్లు, వరదలు, రోగాల వల్ల పోయే ప్రాణాల కంటే ప్రమాదంలో అధికంగా ప్రాణాలు కోల్పోతున్నామని, రొడ్డు ప్రమాదాల నియంత్రణకు మనమంతా కలిసి పని చేయాలని అన్నారు. రొడ్డు భద్రతా ప్రమాణాలను పిల్లల సిలబస్ లో కూడా పెట్టెలా చూస్తామని అన్నారు. రోడ్డు భద్రత నియమాలను పాటించని వారి లైసెన్స్ రద్దు చేసి భవిష్యత్తులో జారీ చేసేందుకు వీలు లేకుండా సాఫ్ట్వేర్ రూపొందించేందుకు ప్రయత్నిస్తున్నామని, ప్రతి ఒక్కరు నిబంధనలు పాటించాలని అన్నారు. రోడ్డు భద్రత ప్రమాణాల కార్యక్రమాలకు విస్తృత ప్రచారం ఉండాలని, స్థానిక మంత్రులు, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని అన్నారు. రోడ్డు భద్రత ప్రమాణాల అవగాహన కార్యక్రమాల్లో హెల్మెట్ వినియోగం వల్ల కలిగే లాభాలను విస్తృతంగా ప్రచారం చేయాలని, ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ వినియోగించేలా ప్రోత్సహిస్తూ కొంతమందికి హెల్మెట్ పంపిణీ చేయాలని, ఈ కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. మహిళల ప్రయాణికుల సంఖ్య పెరిగిన మార్గాలలో బస్సులు పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి అన్నారు. రవాణా శాఖ అధికారులు దొడ్డు భద్రతా కార్యక్రమాలను ముందుండి నిర్వహించాలని, పాఠశాలలో రోడ్డు భద్రత ప్రమాణాలపై పోటీ పరీక్షలు నిర్వహించాలని అన్నారు.

రెసిడెన్షియల్ పాఠశాలలో పిల్లలకు మెస్ చార్జీలు పెంచామని, వారికి రుచికరమైన నాణ్యమైన ఆహారం అందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. పిల్లలకు అందించే ఆహర నాణ్యతను కలెక్టర్లు, ఉన్నతాధికారులు తనిఖీ చేయాలని, ఆహర సరఫరా చేసే కాంట్రాక్టర్లకు బిల్లులు త్వరగా చెల్లిస్తున్నామని, నాణ్యత అంశంలో ఎక్కడ రాజీ పడేదిలేదన్నారు.

## రోడ్డు భద్రత ప్రమాణాల కార్యక్రమాలు నిర్వహించాలి

### రోడ్డు భవనాల శాఖ స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్

జనవరి నెల మొత్తం రోడ్డు భద్రత ప్రమాణాల కార్యక్రమాలను నిర్వహించాలని, అధికారులను రోడ్డు భవనాల శాఖ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్ ఆదేశించారు. ప్రస్తుత సమాజంలో జరిగే రొడ్డు ప్రమాదాలలో 75 శాతం డ్రైవర్ తప్పుల వల్ల జరుగుతున్నాయని అన్నారు. రాష్ట్రంలోని వాహనాలు నడిపే ప్రతి ఒక్కరికి రోడ్డు భద్రత ప్రమాణాలు, పాటించాల్సిన నియమ నిబంధనల పై అవగాహన కల్పించాలని అన్నారు. రోడ్ల పై ప్రమాదాలు జరిగినప్పుడు అంబులెన్స్ ఏ ఆసుపత్రికి తీసుకుని రావాలి ఒక ప్రణాళిక ఉండాలని, దినిపై అవగాహన కల్పించాలని అధికారులకు ఆయన సూచించారు. ప్రతి జిల్లా స్థాయిలో ఉన్న రోడ్ సేఫ్టీ కౌన్సిల్ సమావేశం నిర్వహించి, ఆక్సిడెంట్ ప్రోన్ ఏరియా గుర్తించాలని, అక్కడ అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రతి పాఠశాల పరిసరాలలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు చిన్నతనం నుంచి ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన ఉండాలని అన్నారు. రోడ్డు భద్రత ప్రమాణాలపై లోకల్ ఎఫ్.ఎం రేడియో, కేబుల్ చానల్స్ లో టెలికాస్ట్ అయ్యేలా చూడాలని అన్నారు. రోడ్లు భవనాల శాఖ, పంచాయతీ రోడ్లు, జాతీయ రహదారుల్లో అవసరమైన సైన్ బోర్డులు ఉండేలా జిల్లా రవాణా శాఖ అధికారి పర్యవేక్షించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య మాట్లాడుతూ జిల్లాలో అన్ని పాఠశాలల ప్రిన్సిపాల్ బాధ్యులతో కూడిన వాట్సాప్ గ్రూపులు తయారు చేసి, ప్రతిరోజు వారికి రహదారుల భద్రతపై ఒక సందేశాన్ని పంపిస్తామని దానిని వారు పాఠశాలలో ఉదయం జరిగే అసెంబ్లీలో పిల్లలకు వివరిస్తారని, ఈ నెలలోని ప్రతిరోజు రహదారి భద్రతపై పిల్లలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. అలాగే పాఠశాల విద్యా కార్యక్రమంలో భాగంగా 9, 10 తరగతిలో సిలబస్లలో చేర్చితే మంచి ప్రభావం ఉంటుందని అన్నారు. ఈ రహదారి భద్రత మాసోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ అప్పయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, ఆర్ఎం ఆర్టిసి భాను ప్రసాద్, ఈఈ ఆర్ అండ్ బి సురేష్, ఈఈ నేషనల్ హైవే మనోహర్, ఆర్టిఓ వేణుగోపాల్, కాజీపేట, పరకాల ఏసీపిలు తిరుమల్, సతీష్, ఇతర ఉన్నత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డిపాజిట్లు, ఆర్థికపరమైన అంశాలపై సమీక్ష



హనుమకొండ/జనవరి 4,(జర్నలిస్ట్ వార్త): ట్రైనింగ్ గురించి అధికారులు చెప్పినట్టు, ఏ విధమైన సమస్యలు తెలత్తకుండ, పూర్తి అవగాహనతో ఉండాలని అన్ని డిపాజిట్లు, ఆర్థికపరమైన అంశాలపై అవగాహన కలిగి ఉండాలని అధికారులకు జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య సూచించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) సిసిలు, ఏపిఎమ్‌లు, డిపిఎమ్‌లు, జడ్ఎస్ఈసి సభ్యులకు గ్రామ సంఘం వీవో, మండల సమాఖ్య ఎంఎంఎస్ జిల్లా సమాఖ్య జడ్ఎస్ ఉప విధులు నిబంధనావళి, ఆర్థిక నియమాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శాయంపేట మండలంలో చాలా తక్కువ స్థాయిలో చిన్న స్థాయి వ్యాపారులు, మహిళలకి సంబంధించిన వ్యాపారాలు ఎందుకు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. వచ్చే సమావేశంలో పూర్తి స్థాయిలో తమ వ్యాపారాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి జిల్లా, మండల, ఆర్పీ అధికారులు తమ పెట్టుబడుల ద్వారా పెట్టిన వ్యాపారాలు ఎలా ఉన్నాయో తనిఖీ చెయ్యాలని కోరారు. రాబడుల గురించి ప్రతి రిపోర్ట్ బద్రపరుచుకునేల చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి వ్యాపార కేంద్రాలను సందర్శించి, వ్యాపార సలహా, సూచనలు కల్పించాలని కోరారు. ప్రతి మండలంలో ఇందిరా మహిళా శక్తి పథకం కింద సోలార్ పవర్ ప్రాజెక్ట్ మండలానికి 350 మందిని ఎన్నిక చేసి, కుట్టు మిషన్ ట్రైనింగ్ సెంటర్లు నిర్వహించాలని కోరారు. ఢబ్ల్యూఈ –హబ్ గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అందులో తమ వ్యాపారం ఎలా అభివృద్ధి పథంలో నడపాలో ట్రైనింగ్ తీసుకోవాలని కోరారు. తద్వారా మంచి లాభాలు పొందేలా చూడాలని పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి యం.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మహిళా డైరీ ఏర్పాటు అంశాలపై సమీక్షించిన కలెక్టర్ ప్రావిణ్య



హనుమకొండ/జనవరి 4,(జర్నలిస్ట్ వార్త): హనుమకొండ జిల్లా కలెక్టరేట్ సమావేశ హాల్లో శనివారం మహిళా డైరీ ఏర్పాటు చేయటానికి గల అవకాశాలపై హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య సమీక్ష సమావేశం నిర్వహించారు. పరకాల నియోజకవర్గం లోని 6 మండలాల్లో నిర్వహించిన సర్వేలో వచ్చిన సమాచారం మేరకు ఏ శాఖ వారు ఏం చేయాలనే విషయమై చర్చించి వారికి సూచనలు చేశారు. త్వరలో ఎన్ డి సి సి ఎఫ్ ద్వారా డైరీ ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించి, వారికి ఇచ్చిన నివేదిక ప్రకారం డైరీ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం కుసుంలో భాగంగా సౌరశక్తి ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటుకు సంబంధించి స్థలాలను త్వరలో ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నేషనల్ హైవే పనులు నెల రోజుల్లో పూర్తి కావాలి

### - వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా



వరంగల్/జనవరి 4,(జర్నలిస్ట్ వార్త): వరంగల్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో శనివారం నిర్వహించిన నేషనల్ హైవే ల్యాండ్ ఎక్విజేషన్ పనులపై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వరంగల్ డివిజన్ నుండి గీసుకొండ, సంగెం, పర్వతగిరి, నర్సంపేట డివిజన్ నుండి నెక్కొండ మండలాలలో నిర్వహించే నేషనల్ హైవే పనులు నెల రోజుల్లో పూర్తి కావాలని సంబంధిత మండలాల తహశీల్దార్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి డిఆర్ఓ విజయలక్ష్మి, సంబంధిత మండలాల తహశీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఓడిఎఫ్ అమలు తీరులో జిల్లా ముందు వరుసలో ఉండాలి

### - వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా

వరంగల్/జనవరి 4,(జర్నలిస్ట్ వార్త): వరంగల్ జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్ పై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశం డిఆర్డిఓ కౌసల్య దేవి ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్షా సమావేశానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా పాల్గొని జిల్లాలో ఓడిఎఫ అమలు తీరులో జిల్లా ముందు వరుసలో ఉండాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమం అమలు తీరులో భాగంగా అంతరాలను తొలగించడానికి ప్రతి కాంపొండెంట్ నుంచి గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి పకడ్బందీగా చేయాలని అన్నారు. ఇంటి నుండి తడి పొడి చెత్త వేరుగా సేకరించి, ట్రాక్టర్ల ద్వారా సెగ్రిగేషన్ షెడ్లలో తడి చెత్తను పొడి చెత్తను వేరువేరుగా చేయాలని, ప్లాస్టిక్ వ్యర్థాలను గ్రామస్థాయి నుంచి సేకరించి స్క్రాప్ డీలర్లకు అమ్మాలని అన్నారు. ఇంటి నుంచి వచ్చే మురుగునీటిని ఫిల్టరేషన్ ద్వారా పరిష్కరించాలని, మురుగు నీటి డ్రైనేజీ చివర్లలో సామూహిక ఫిల్టరేషన్ నిర్మించుటకు చిన్న గ్రామాన్ని ఎంపిక చేసి, పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని మురుగునీటి శుద్ధీకరణ చేయుటకు సంబంధిత అధికారులను కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. స్వచ్ఛ భారత మిషన్ గ్రామీణ కార్యక్రమంపై విస్తృత ప్రచారం చేసి గ్రామాలు, మండలాలు, పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రామ్ రెడ్డి, పీఈపిఆర్ ఎంపీడీవోలు, మున్సిపల్ అధికారులు, స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థవరంపై పోలీసుల దాడి

కల్లూరు/జనవరి4(జర్నలిస్ట్ వార్త): కల్లూరు మండల పరిధిలో తూర్పు లోకారం లో నమ్మదగిన సమాచారం మేరకు శనివారం కల్లూరు ఎస్ఐ సిబ్బంది తో పేకాట స్టావారాలపై దాడులు చేశారు. ఎస్సై తెలిపిన వివరాలప్రకారం తూర్పులోకారం గ్రామ శివారులో గల వైకుంఠధామం ఖాళీ స్థలంలో పేకాట ఆడుతున్న తడికమల్ల సీతయ్య తండ్రి సాంబయ్య, మూకర గణేష్ తండ్రి గురవయ్య ,ఉయ్యాల గోపి తండ్రి వెంకటేశ్వర్లు, కప్పల రాజు తండ్రి రాములు, ఎర్రబడి నాగేశ్వరరావు తండ్రి కోటేశ్వరరావు,పట్టుకుని వారి వద్ద నుండి రూపాయలు 20,600, మూడు ద్విచక్ర వాహనాలు మరియు ఐదు సెల్ ఫోన్లను నూట రెండు పేకాట పేక ముక్కలు స్వాధీనపరచుకొనగా ఖమ్మం పాటి బుచ్చాలు అను వ్యక్తి పారిలో ఉన్నట్లు ఉవరించారు. పట్టుకున్నవారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామన్నారు.

## దొంగతనానికి పాల్పడ్డా నిందితుడు అరెస్టు

బోథ్/జనవరి04(జర్నలిస్ట్ వార్త): మండల కేంద్రంలోని ఓ ఇంట్లో దొంగతనానికి పాల్పడిన నిందితుడు సీసీఎల్ 16 ను అరెస్టు చేసినట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ శనివారం తెలిపారు ఆయన తెలిపిన వివరాల ప్రకారం బోథ్ బస్టాండ్ సమీపంలోని సూర్యవంశి ఉలాజి అనే వ్యక్తి ఈనెల రెండవ తేదీన తన పొలం పనుల కోసమని తన ఇంటికి తాళం వేసి వెళ్లాడు కాగా మధ్యాహ్నం మూడు గంటల సమయంలో పొలం పనులు ముగించుకొని ఇంటికి రాగా ఇంటి తాళం పగలగొట్టి ఉంది తన ప్యాంటు జేబులో ఉంచిన పదివేల రూపాయల నగదు సైతం లేకపోవడంతో దొంగతనం జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా బాధితుడు ఇంటిపై అమర్చిన సీసీ కెమెరా పుటేజీ ఆధారంగా అరెస్టు చేసి అతని వద్ద నుంచి పదివేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ చేసిన కౌన్సిలర్ దేశిడీ శేఖర్ రెడ్డి



నలగొండ/జనవరి04 (జర్నలిస్ట్ వార్త): మిర్యాలగూడ పట్టణంలోని రెడ్డి కాలనీలో గల పులిమెడు ఆశ్రమంలో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సహకారంతో రెడ్డి కాలనీ కౌన్సిలర్ దేశిడి శేఖర్ రెడ్డి కాలనీకి చెందికాగాని మల్లికార్జున్ కి సీఎం రిలీఫ్ చెక్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి 25 వ వార్డు ఇంచార్జ్ గోదాల జానకి రామ్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం కంటే సీఎం రేవంత్ రెడ్డి మెరుగైన ప్రజా పాలన అందిస్తూ సీఎం సహాయ నిధికి అప్లై చేసుకున్నా కొద్ది వ్యవధిలోనే ఆపద్బాంధవుడు లాగా అతి త్వరలో చెక్కులు మంజూరు చేయడం జరుగుతుంది అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సీఎం రేవంత్ రెడ్డి కి స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ వర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో 27 వ వార్డు ఇంచార్జ్ గొట్టిముక్కల లక్ష్మణ్ యాది రెడ్డి,డప్పు శ్రీనివాస్, కుప్పాల శ్రీనివాసరావు, పాలగడి రంగారావు,దేషిడి కిషోర్ రెడ్డి శ్రీనివాస్,తాళ్ల వెంకటరెడ్డి,యెర్నేని రామారావు,ఆంజనేయులు, ఖర్జూర రవి,శ్యాం సుందర్ రెడ్డి,రాజా, శివ,కొండల్,నరేందర్,శి వకోటి శివ. రమేష్ గౌడ్. ఓంకార్ రెడ్డి.దినేష్ రెడ్డి. వెంకటేశ్వర్లు సైదా ఆర్టిసి వెంకన్న రవి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా డాక్టర్ రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు



రాయపర్తి/జనవరి04 (జర్నలిస్ట్ వార్త): మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విద్య వైద్యం సామాజిక అంశాలుగా,దశాబ్దాలుగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న నియోజకవర్గ నాయకులు డాక్టర్ రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యా నాయక్ తో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి,శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ ఇన్చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరాజేందర్ రెడ్డి కుటుంబం,ఎన్నో దశాబ్దలుగా నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని అన్నారు.వారు ఏ రాజకీయ జెండా లేనప్పుడే ప్రజాసేవే ఏజెండగా విద్యా,వైద్యం సామాజిక అంశాలుగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేసిన వారి జీవితం ఆదర్శప్రాయమని అన్నారు.దేవుడు ఝాన్సీరాజేందర్ రెడ్డి దంపతులకు సేవలను మరింత విస్తరించేలా ఆయురారోగ్యాలు,శక్తి సామర్ధ్యాలను ప్రసాదించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి,పాలకుర్తి సోమనాథ ఆలయ చైర్మన్ కృష్ణమాచార్యులు,రాయపర్తి పట్టణ అధ్యక్షులు మచ్చ రమేష్, జిల్లా మహిళా నాయకురాలు కాంచనపల్లి వనజారాణి,పెండ్లి మహేందర్ రెడ్డి, ఎండి ఉస్మాన్, గబ్బెట బాబు, చిర్ర మల్లయ్య,కందికట్ల రాజయ్య, రామా నాయక్,గోపాల్,పిరని ప్రవీణ్, కందుకూరి కృష్ణ, చిర్ర శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



రాయపర్తి/జనవరీ04(జర్నలిస్ట్ వార్త): మండలంలోని మైలారం గ్రామానికి చెందిన గాడిపెల్లి సారయ్య ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్ కు గురై హన్మకొండ రోహిణి హాస్పిటల్ లో చికిత్స పొందుతుండగా శనివారం బాదిత కుటుంబానికి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమం లో ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు గాడిపెల్లి రాములు, గాడిపెల్లి యాకయ్య, చిర్ర దర్గయ్య, గాడిపెల్లి ఆనంద్, గాడిపెల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రముఖ అణు శాస్త్రవేత్త డాక్టర్ రాజగోపాల చిదంబరం కన్నుమూత



ముంబై,జనవరి04(జర్నలిస్ట్ వార్త): :ప్రముఖ అణు శాస్త్రవేత్త డాక్టర్ రాజగోపాల చిదంబరం(88) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ముంబై జస్‌లోక్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. రాజగోపాల చిదంబరం మృతి పట్ల శాస్త్రవేత్తలతో పాటు రాజకీయ ప్రముఖులు నివాళులర్పిస్తున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటిస్తున్నారు. అణు శాస్త్రవేత్తగా తన కెరీర్‌ను చిదంబరం ప్రారంభించారు. పొఖ్రాన్-1(1975), పొఖ్రాన్-2(1998) అణు పరీక్షల్లో రాజగోపాల చిదంబరం కీలకపాత్ర పోషించారు. అణుశక్తి కమిషన్‌కు చైర్మన్‌గా సేవలందించారు. రాజగోపాలకు 1999లో పద్మవిభూషణ్, 1975లో పద్మశ్రీ పురస్కారాలు వరించాయి. భారత ప్రభుత్వానికి శాస్త్రీయ సలహాదారుగా పని చేశారు. బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్‌గా పని చేశారు. అటామిక్ ఎనర్జీ కమిషన్ చైర్మన్‌గా సేవలందించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ సెక్రటరీగా విధులు నిర్వర్తించారు. 1994-95 మధ్య కాలంలో ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ గవర్నర్ల బోర్డుకు చైర్మన్‌గా వ్యవహరించారు.?

# సెప్టిక్‌ట్యాంక్‌లో జర్నలిస్టు మృతదేహం హైదరాబాద్‌లో కాంట్రాక్టర్ అరెస్టు

భోపాల్,జనవరి04(జర్నలిస్ట్ వార్త): జవనరి ఒకటో తేదీ నుంచి అదృశ్యమైన ఇండిపెండెంట్ జర్నలిస్టు ముకేశ్ చంద్రాకర్ మృతదేహాన్ని చత్తీస్‌ఘడ్‌లోని సెప్టిక్ ట్యాంక్‌లో గుర్తించారు. బీజాపూర్‌లోని చాతన్పారా బస్తీ లో ఆ జర్నలిస్టు బాడీని వెలికితీశారు. ముకేశ్ చంద్రాకర్.. ఎన్డీటీవీకి కాంట్రిబ్యూటింగ్ రిపోర్టర్‌గా పనిచేస్తున్నాడు. కాంక్రీట్‌తో సీలింగ్ చేసిన సెప్టిక్ ట్యాంక్‌లో మృతదేహాన్ని గుర్తించినట్లు బీజాపూర్ పోలీసులు వెల్లడించారు. అతని శరీరం వాచిపోయింది. తల, వెన్నుకు పలు చోట్ల గాయాలు అయ్యాయి. దుస్తుల ద్వారా అతన్ని గుర్తించారు. ముకేశ్ మొబైల్ లొకేషన్ ఆధారంగా.. అతను చివరి సారి సురేశ్ చంద్రాకర్ కాంట్రాక్టర్‌తో మాట్లాడినట్లు పసికట్టారు. సురేశ్‌ను పోలీసులు ప్రశ్నిస్తున్నారు. ముకేశ్ రాసిన కథనాలకు అతని మరణం లింకైందా అన్న కోణంలో దర్యాప్తు చేపడుతున్నారు. దోషుల్ని త్వరలో పట్టుకోనున్నట్లు ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపారు. బస్తర్ జంక్షన్ అన్న పేరుతో ముకేశ్ ఓ యూట్యూబ్ చానల్‌ను నడిపిస్తున్నాడు. దానికి 1.59 లక్షల సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. బస్తర్ ప్రాంతంపై అతను పూర్తి ఫోకస్‌తో వీడియోలు చేసేవాడు. 2021లో మావోలు కిడ్నాప్ చేసిన సీఆర్పీఎఫ్ కోబ్రా కమాండో రాకేశ్వర్ సింగ్ మన్హాస్‌ను విడిపించడంలో ముకేశ్ కీలక పాత్ర పోషించాడు. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న పోలీసులు హైదరాబాద్‌లో ఓ కాంట్రాక్టర్‌ను అరెస్టు చేశారు.

# నిరుపేదలకు సేవా చేయడంలో లయన్స్ క్లబ్ ముందుంటుంది

## - లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఘట్టమనేని బాబురావు





తల్లాడ/జనవరి04(జర్నలిస్ట్ వార్త): నిరుపేదలకు సేవా చేయడంలో లయన్స్ క్లబ్ ముందుంటుందని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఘట్టమనేని బాబురావు అన్నారు.శనివారం స్థానిక ఆర్. బి గార్డెన్ లో నిర్వహించిన్న మెంబర్స్ ఇంట్రక్షన్ కార్యక్రమంలో తల్లాడ లయన్స్ క్లబ్ వారు వివిధ సేవా కార్యక్రమాలు, సభ్యులు చేర్పించడంలో జిల్లాలో ముందు స్థాయిలో మెదటి స్థానంలో కి తీసుకు వచ్చినందుకు వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. క్లబ్ అధ్యక్షులు బెల్లంకొండ ఆంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని పురస్కరించుకొని మండలంలోని నిరుపేదలైన ఏడుగురు మహిళలకు 45,000 రూపాయలు విలువ చేసే 7 కుట్టుమిషన్లు, 27 వేల రూపాయలు విలువచేసే ఆప్లి వైర్ మైక్ సెట్ ను ముత్యాలమ్మ గుడికి , వికలాంగులకు వీల్ చైర్ అందించినారు.ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఘట్టమనేని బాబురావు మల్టిపుల్ లయన్ లీడర్లు, జిల్లా గవర్నర్ యారాల ప్రభాకర్ రెడ్డి, ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్లు డాక్టర్ కాపా మురళీకృష్ణ, జిఎస్టి కోఆర్డినేటర్ , శ్యాంబాబు, ఆర్. సి. పూర్ణచంద్రరావు, జోన్ చైర్మన్ పెనుగొండ ఉపేంద్ర రావు డిస్టిక్ చైర్మన్ లక్ష్మారెడ్డి, దార శ్రీనివాసరావు, క్లబ్ కార్యదర్శి కటికి వెంకటేశ్వర్లు కోశాధికారి శీలం వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హమాలీ కూలి రేట్లు పెంచాలి

## -టి యు సి ఐ జిల్లా కార్యదర్శి జి రామయ్య



తల్లాడ/జనవరి04(జర్నలిస్ట్ వార్త): హమాలీ కూలి రేట్లు పెంచాలని టి యు సి ఐ జిల్లా కార్యదర్శి జి రామయ్య అన్నారు. శనివారం తల్లాడ పట్టణంలో హమాలి బ్రాంచ్ కమిటీ అధ్యక్షులు పటాన్ నాగుల మీరా అధ్యక్షతన జరిగిన జనరల్ బాడీ సమావేశంలో వారు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా రాష్ట్రంలో జిల్లాలో నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే కార్మికుల వేతనాలు మాత్రం చాలా దారుణంగా ఉన్నాయన్నారు అనునిత్యం చంటోర్చిపనిచేసిన కార్మికులకు వేతనాలు సరిపోవడం లేదని దీనివల్ల కుటుంబాలను సాకే పరిస్థితి లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మిక వర్గానికి ఎలాంటి చట్టబద్ధమైన హక్కుల లేకపోవడం వల్ల వ్యాపార యాజమాన్యాల మీదనే ఆధారపడి రెండు సంవత్సరాలకు ఒకసారి వేతన ఒప్పందాలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వ్యాపార వర్గాలు తమ వ్యాపారాలు లాభాలు వస్తేనే తప్ప కార్మికుల వేతనాలు గురించి ఆలోచించే పరిస్థితి లేదని అన్నారు. తల్లాడపట్టణంలో పనిచేస్తున్న పత్తి, మిర్చి కార్మికుల యొక్క వేతన ఒప్పందం ముగిసి 8 నెలలు అవుతున్న నేటికీ వారి వేతనాల గురించి వ్యాపార వర్గాలు ఆలోచించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పత్తి మిర్చి వ్యాపార యాజమాన్యాల వారు కార్మికుల యొక్క ఇబ్బందులను గుర్తించి వారి యొక్క వేతన ఒప్పందం కొరకు కార్మికులతో చర్చలు జరిపించాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వారి యొక్క వేతనాలను 50 శాతం పెంచాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో టి యు సి ఐ జిల్లా ఉపాధ్యక్షులు డి శ్రీనివాసరావుతల్లాడ బ్రాంచ్ కమిటీ అధ్యక్షులు పటాన్ నాగుల మీరా హమాలి సంఘంనాయకులుగార్లపాటి నాగేశ్వరరావు నల్లగొండ వెంకన్న దుగ్గిదేవరరాఘవరావుచాపల రామకృష్ణ కృష్ణయ్యరాఘవరావు రంగయ్య దడిపల్లికృష్ణయ్య దాసరి కృష్ణారావు వెంకటేశ్వర్ రెడ్డి రవి రామారావు కృష్ణతదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక బలోపేతానికి సిఎం కృషి

## వ్యాపారాలకు వీలుగా వడ్డీలేని రుణాలు :మంత్రి సీతక్క వెల్లడి



రంగారెడ్డి,జనవరి04(జర్నలిస్ట్ వార్త):

సీఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలని నిశ్చయించుకున్నారని మంత్రి సీతక్క తెలిపారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి తర్వాత మహిళల అభ్యున్నతికి ఆలోచిస్తున్న ఘనత సీఎం రేవంత్ రెడ్డిదేనని అన్నారు. మహిళా సంఘాలకు 19 రకాల వ్యాపారాలు చేసుకోవడానికి వడ్డీ లేని రుణాలు మంజూరు చేశారని మంత్రి సీతక్క పేర్కొన్నారు. షాద్ నగర్ నియోజకవర్గంలో మంత్రి సీతక్క పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రూ. 35 కోట్లతో పలు రోడ్లు, కమ్యూనిటీ హాల్స్ శంకుస్థాపన కార్యక్రమాలు చేపట్టారు. మహిళ సాధికరితకు రూ. 80 కోట్ల నిధులు మంజూరు చేశారు. మంత్రి వెంట స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఉన్నారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ.. మహిళలు ఎదుగుతుంటే బీఆర్ఎస్ నాయకులు కళ్ళలో నిప్పులు పోసుకుంటున్నారని దుయ్యబట్టారు. ఒక్క చీర ఇచ్చి వందల సార్లు చెప్పుకున్న ఘనత బీఆర్ఎస్ పార్టీ నాయకులది అని ఆరోపించారు. రైతులకు 21 వేల కోట్లు రుణ మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదని తెలిపారు. సన్న వడ్లకు 500 బోనస్ ఇస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వంలో గుట్టలకు, రోడ్లకు రైతు బంధు ఇచ్చారు.. బీఆర్ఎస్ చేసిన అప్పుల వల్ల ప్రభుత్వం పై 24 వేల కోట్లు భారం పడిందని అన్నారు. మరోవైపు.. కొన్ని యూట్యూబ్ ఛానెల్స్ ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలపై బురద జల్లుతున్నరన్నారు. మహిళలు తలుచుకుంటే ఇంటినే కాదు, సమాజాన్ని, దేశాన్ని సైతం ఏలగలరని మంత్రి సీతక్క తెలిపారు.

# సినీ పరిశ్రమకు రాజకీయ రంగులొద్దు

## : గేమ్ చేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పవన్ కళ్యాణ్

రాజమండ్రి
ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాజమండ్రిలో ఏర్పాటు చేసిన గేమ్ చేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్ కు చీఫ్ గెస్ట్ గా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ... "గేమ్ చేంజర్ ఈవెంట్‌కు వచ్చిన ప్రతీ ఒక్కరికీ నమస్కారాలు. ఈవెంట్‌ను వీక్షిస్తున్న ప్రతీ ఒక్కరికీ నమస్కారాలు. అలానే పవన్ కళ్యాణ్ అభిమానులకు కూడా నమస్కారాలు (నవ్వుతూ). శంకర్ గారు చేసిన జెంటిల్మన్ సినిమాను చెన్నైలో చూశాను. ప్రేమికుడు సినిమాకు అమ్మమ్మతో వెళ్లాను. సామాజిక సందేశాన్ని అందిస్తూ శంకర్ గారు సినిమాలు తీస్తుంటారు. ఈ రోజు రాజమౌళి గారు, రామ్ చరణ్ గారు, ఎన్టీఆర్ గారు గ్లోబల్ స్థాయికి వెళ్లారు. దానికి కొంత మంది సౌత్ దర్శకులు కారణం. అందులో శంకర్ గారు ఒకరు. తమిళంలో శంకర్ గారు సినిమాలు తీసి తెలుగు వారిని మెప్పించారు. ఆయన తెలుగులో సినిమా చేస్తే బాగుంటుందని ఎప్పటి నుంచో అనుకున్నాను.

ఇక దిల్ రాజు గారు నా తొలిప్రేమ సినిమాను డిస్ట్రిబ్యూట్ చేశారు. నేను బాగా కష్టాల్లో ఉన్నప్పుడు వకీల్ సాబ్ సినిమా ఇచ్చారు దిల్ రాజు. ఆయన ఇచ్చిన డబ్బులే జనసేనకు ఇంధనంగా మారింది.

రామ్ చరణ్ రంగస్థలం సినిమాకు అవార్డు వస్తుందని అనుకున్నాను. గోదారి తీర ప్రాంతాల్లో జీవించకపోయినా.. అద్భుతంగా నటించాడు. తండ్రి మెగాస్టార్ అయితే కొడుకు గ్లోబల్ స్టార్ అవుతాడు. సంకల్ప బలం, పట్టుదల, కార్యదక్షత ఉంటే.. అందరూ మెగాస్టార్ చిరంజీవిలా ఎదగొచ్చు. ఆయన అంతలా ఎదగబట్టే నేను ఈ రోజు ఇలా ఈ స్థాయిలో ఉన్నాను. మా అన్నయ్య చిరంజీవి షూటింగ్‌లు చేసి ఇంటికి అలిసిపోయి వచ్చేవారు. ఆ టైంలో ఖాళీగా ఉండే నేను.. ఆయన షూస్, సాక్సులు తీసి కాళ్లు



తుడిచేవాడిని. ఈ హీరో సినిమా పోవాలని మా జీవితంలో ఎప్పుడూ అనుకోలేదు. సర్వేజనా సుఖినోభవంతు అని మా తండ్రి గారు మాకు నేర్పించారు. అందరూ బాగుండాలని మేం కోరుకుంటాం. రామ్ చరణ్ హార్స్ రైడింగ్ చూస్తే నాకు అసూయగా అనిపిస్తుంది. నాకు హార్స్ రైడింగ్ రాదు. కానీ గబ్బర్ సింగ్ టైంలో హార్స్ రైడింగ్ పెట్టారు. నాకు హార్స్ రైడింగ్ రాదు అని గుర్రం దగ్గరకు వెళ్లి చెప్పా. దానికి క్యారెట్ పెట్టాను. అది నన్ను సురక్షితంగా తీసుకెళ్లింది. కానీ రామ్ చరణ్ మాత్రం హార్స్ రైడింగ్‌లో శిక్షణ తీసుకున్నాడు. ఈ గేమ్ చేంజర్ ట్రైలర్ చూశాను. నాకు చాలా నచ్చింది. సామాజిక సందేశం ఇచ్చేలా ఉందనిపిస్తోంది.
ఈవెంట్‌కు వచ్చిన ప్రతీ ఒక్కరూ క్షేమంగా తిరిగి వెళ్లాలి. మీకు ఏమైనా అయితే నా గుండెకు గాయమైనట్టుగా ఉంటుంది. సినిమాను సినిమాలా చూడండి. టికెట్ రేట్లు డిమాండ్ అండ్ సప్లై మీద ఆధారపడి ఉంటుంది. తెలుగు సినిమా స్థాయి పెరిగింది. ప్రతీ టికెట్ మీద జీఎస్టీ ఉంటుంది. ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. సినిమా రంగానికి రాజకీయ రంగు పులమడం నాక్కూడా ఇష్టం ఉండదు. అన్ని ఇండస్ట్రీల వ్యక్తులు కలిసి సినిమాల్ని చేస్తున్నారు. హాలీవుడ్‌ని అనుకరించడం కాకుండా మన మూలాల్ని పైకి తెచ్చేలా కథల్ని తీసుకురావాలి. స్వర్గీయ ఎన్టీరామారావు ఎప్పుడూ కూడా ఎవ్వరి మీద వివక్షను చూపించలేదు. చంద్రబాబు గారు సైతం ఎప్పుడూ తెలుగు చిత్ర సీమ అభివృద్ధికి దోహద పడుతూనే ఉన్నారు.

# నాకు మీ సపోర్టు కావాలి

## : అగ్ర నిర్మాత నాగవంశీ



టాలీవుడ్ అగ్ర నిర్మాత నాగవంశీ అభిమానులను ఉద్దేశించి ఆసక్తికర పోస్ట్ పెట్టాడు. ఇది మన అందరి సినిమా. నాకు మీ అందరి సపోర్ట్ చాలా అవసరం ఎక్స్ వేదికగా అభిమానులను రిక్వెస్ట్ చేస్తున్నాడు. వివరాల్లోకి వెళితే.. ఆయన నిర్మాణంలో వస్తున్న తాజా చిత్రం డాకు మహారాజ్ . నందమూరి బాలకృష్ణ ప్రధాన పాత్రలో నటిస్తుండగా.. వాల్తేరు వీరయ్యతో 2023లో బ్లాక్ బస్టర్ అందుకున్న బాబీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమా బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. అయితే ఈ సినిమా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే వరుస ప్రమోషన్స్ నిర్వహిస్తుంది చిత్రబృందం. ఇదిలావుంటే ఈ సినిమాలోని దబిడి దిబిడి సాంగ్‌పై నెట్టింటా ట్రోల్స్ వస్తున్న విషయం తెలిసిందే. దీంతో మూవీపై కూడా నెగిటివ్ ట్రెండ్ చేస్తున్నారు నెటిజన్లు. మరోవైపు ఎన్టీఆర్ ఫ్యాన్స్ కూడా ఈ సినిమాపై ఆసక్తి చూపించట్లేదు. ఇప్పటికే నందమూరి ఫ్యామిలీలో ఉన్న గొడవలతో బాలకృష్ణ, తారక్ దూరంగా ఉంటూ వస్తున్నారు. రీసెంట్‌గా దేవర సినిమా అప్పుడు కూడా బాలకృష్ణ ఎటువంటి రెస్పాన్స్ ఇవ్వకపోవడంతో ఈ వివాదం మరింత ముదిరింది. దీంతో బాలకృష్ణ డాకు మాహరాజ్‌ని టార్గెట్ చేస్తున్నారు తారక్ ఫ్యాన్స్. అయితే ఈ వివాదం ముదురుతున్న నేపథ్యంలో మూవీకి సంబంధించి ఆసక్తికర పోస్ట్ పెట్టాడు నిర్మాత నాగ వంశీ. ఇది మన అందరి సినిమా. నాకు మీ అందరి సపోర్ట్ చాలా అవసరం. అందరం ప్రశాంతంగా ఉండి మన సినిమా అతి పెద్ద బ్లాక్ బస్టర్ సక్సెస్ అవ్వటానికి ప్రయత్నిద్దాం. ప్రేమతో మీ నాగవంశీ అంటూ రాసుకోచ్చాడు. కాగా ఇందుకు సంబంధించిన ట్విట్ వైరల్‌గా మారింది.

# బ్రిటీష్ అవార్డులకు భారతీయ సినిమా




భారతీయ దర్శకురాలు పాయల్ కపాడియా దర్శకత్వంలో వచ్చిన 'ఆల్ వి ఇమేజిన్ యాజ్ లైట్' చిత్రం ఇప్పటికే పలు అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్స్‌లో సత్తాచాటిన విషయం తెలిసిందే. ఇప్పటికే కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌తో పాటు గోల్డెన్ గ్లోబ్స్ పురస్కారాలకు నామినేట్ అయిన ఈ చిత్రం తాజాగా బాఫ్టా (బ్రిటిష్ అకాడమీ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఆర్ట్స్) అవార్డులలో కూడా సత్తా చాటింది. బాఫ్టా 2025లో ఉత్తమ దర్శకుడి విభాగంతో పాటు బెస్ట్ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే, బెస్ట్ ఫిల్మ్ నాట్ ఇన్ ఇంగ్లీష్ విభాగాల్లో ఈ చిత్రం నామినేట్ అయ్యింది. ఈ విషయాన్ని బాఫ్టా అధికారికంగా ప్రకటించింది. విజేతల జాబితాను ఈ నెల 15న వెల్లడించనున్నారు అకాడమీ నిర్వాహకులు. ముంబయి నర్సింగ్ హెూమ్‌లో పనిచేసే కేరళకు చెందిన ఇద్దరు నర్సుల కథ ఆధారంగా వచ్చిన ఈ చిత్రం గతేడాది జరిగిన ప్రతిష్మాత్మక 77వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రతిష్టాత్మక గ్రాండ్ ప్రిక్స్ అవార్డును గెలుచుకుంది. మరోవైపు ఈ సినిమాను చూసిన అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ప్రశంసలు కురిపించాడు. మరోవైపు ఈ చిత్రం డిస్నీ ం హాట్ స్టార్ వేదికగా ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతుంది.

# ఆ క్యారెక్టర్‌లో జీవించాలన్నది నా డ్రీమ్

## : మీనాక్షి చౌదరి



'పోలీస్ క్యారెక్టర్‌లో నటించాలన్నది నా డ్రీమ్. ఎప్పటి నుంచో అవకాశం కోసం ఎదురుచూస్తున్నా. కెరీర్ ఆరంభంలోనే ఇలాంటి పాత్ర లభించడం ఆనందంగా ఉంది' అని చెప్పింది మీనాక్షి చౌదరి. అనతికాలంలోనే తెలుగు అగ్ర కథానాయికల్లో ఒకరిగా గుర్తింపు తెచ్చుకున్న ఈ భామ నటించిన తాజా చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. వెంకటేష్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో దిల్ రాజు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకొస్తున్నది. ఈ సందర్భంగా శుక్రవారం మీనాక్షి చౌదరి పాత్రికేయులతో మాట్లాడింది. తాను ఇప్పటివరకు కామెడీ జోనర్ సినిమా చేయలేదని, తొలిసారి ఈ తరహా పాత్రలో నటించడం కొత్త అనుభూతినిచ్చిందని తెలిపింది. ఇందులో తాను యాక్షన్ సీక్వెన్స్ కూడా చేశానని, ఆ ఎపిసోడ్స్‌ను ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారని చెప్పింది. 'పోలీస్ పాత్ర కోసం ఎలాంటి రిఫరెన్స్ తీసుకోలేదు. మా నాన్న ఆర్మీ ఆఫీసర్ కాబట్టి వారి బాడీ లాంగ్వేజ్, మేనరిజమ్స్ మీద అవగాహన ఉంది. నేను కూడా లేడీ పోలీసుల తాలూకు కొన్ని విషయాలను సేకరించాను' అని చెప్పింది. వెంకటేష్ వంటి సీనియర్ నటుడితో కలిసి నటించడం ఆనందంగా ఉందని, ఆయన ఎప్పుడూ ప్రశాంతగా కనిపిస్తారని, కామెడీ టైమింగ్ అద్భుతంగా ఉంటుందని మీనాక్షి చౌదరి పేర్కొంది. గత ఏడాది సంక్రాంతికి 'గుంటూరు కారం'తో ప్రేక్షకుల్ని పలకరించానని, ఈ ఏడాది 'సంక్రాంతికి వస్తున్నాం'లో భాగమయ్యానని, ఈ పండగ తనకు కలిసొచ్చిందని ఆనందం వ్యక్తం చేసింది. ప్రస్తుతం నవీన్ పొలిశెట్టితో ఓ సినిమా చేస్తున్నానని, మరో రెండు చిత్రాలను త్వరలో ప్రకటిస్తానని మీనాక్షి చౌదరి తెలిపింది.

# 'డాకు మహారాజ్' ట్రైలర్ రిలీజ్ టైం లాక్

నందమూరి బాలకృష్ణ హీరోగా బాబీ దర్శకత్వంలో రూపొందుతున్న డాకు మహారాజ్ సినిమా బాక్సాఫీస్ వద్ద సందడి చేయడానికి సిద్ధం అయ్యింది. సంక్రాంతి కానుకగా జనవరి 12వ తారీకున ప్రేక్షకుల ముందుకు రాబోతున్న డాకు మహారాజ్ సినిమా ట్రైలర్‌ను జనవరి 5వ తారీఖున ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నారు. ప్రస్తుతం డల్లాస్ లో భారీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి మేకర్స్ ప్లాన్ చేశారు. ఇప్పటికే మేకర్స్ అంతా అక్కడ ల్యాండ్ అయ్యారు. మరి కాసేపట్లోనే సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ అక్కడ ప్రారంభం కాబోతుంది. అక్కడ ట్రైలర్‌ను విడుదల చేసి, ఇండియాలోనూ అదే సమయంలో ఆన్ లైన్ ద్వారా విడుదల చేయబోతున్నారు. అమెరికా కాలమానం ప్రకారం డిసెంబర్ 4వ తారీకు రాత్రి 9 గంటల సమయంలో ఈవెంట్‌లో ట్రైలర్‌ను లాంచ్ చేస్తారు. ఆ సమయంలో ఇండియాలో జనవరి 5వ తారీకు ఉదయం 8 గంటలు అవుతుంది. అందుకే అదే సమయంలో డాకు మహారాజ్ సినిమా ట్రైలర్‌ను జనవరి 5 ఉదయం 8 గంటల 39 నిమిషాలకు విడుదల చేయబోతున్నారు. అమెరికాలో విడుదల అయిన కొద్ది సమయం తర్వాత ఇండియాలో డాకు మహారాజ్ ట్రైలర్ ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ విషయాన్ని గురించి చిత్ర యూనిట్ సభ్యులు అధికారికంగా టైమ్, డేట్ ఇచ్చి పోస్టర్‌ను విడుదల చేయడం జరిగింది. సితార ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌లో రూపొందిన డాకు మహారాజ్ సినిమాతో బాబీ భారీ విజయాన్ని నందమూరి ఫ్యాన్స్‌కి ఇవ్వబోతున్నాడు. వాల్తేరు వీరయ్య వంటి భారీ విజయాన్ని మెగా ఫ్యాన్స్‌కి అందించిన దర్శకుడు బాబీ కచ్చితంగా నందమూరి ఫ్యాన్స్‌కి డాకు మహారాజ్ సినిమాతో అదే స్థాయి విజయాన్ని కట్టబెట్టే అవకాశాలు ఉన్నాయి.

ఈమధ్య కాలంలో బాబీ సినిమాలు మంచి విజయాలను సొంతం చేసుకుంటూ దూసుకుపోతున్నాయి. కనుక డాకు మహారాజ్ సినిమా ఫలితం విషయంలో ఆందోళన అస్సలు లేదు అంటూ ఫ్యాన్స్ కాన్ఫిడెన్స్‌తో ఉన్నారు. వసూళ్ల గురించి మా లెక్క అంతా అంటూ ఫ్యాన్స్ ధీమాతో కామెంట్స్ చేస్తున్నారు. ఈ సినిమాలో బాలకృష్ణకు జోడీగా ప్రగ్యా జైస్వాల్ హీరోయిన్‌గా నటించగా ఊర్వశి రౌతేలా కీలక పాత్రలో నటించింది. శ్రద్ధ శ్రీనాథ్ సినిమాలో నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించబోతుందట. బాబీ డియోల్ ఈ సినిమాలో నటించడం ద్వారా బాలీవుడ్‌లోనూ ఈ సినిమా గురించి అంచనాలు పెరిగాయి. అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా బాబీ రూపొందించిన ఈ సినిమా బాక్సాఫీస్‌ను షేక్ చేస్తుంది అనే నమ్మకంను ప్రతి ఒక్కరూ వ్యక్తం చేస్తున్నారు. గేమ్ ఛేంజర్, సంక్రాంతికి వస్తున్నాం సినిమాలతో పోటీ తీవ్రంగా ఉన్నా కచ్చితంగా బాక్సాఫీస్ వద్ద మినిమం వసూళ్లను డాకు మహారాజ్ సినిమా వసూళ్లు సాధించే అవకాశాలు ఉన్నాయి.

